

# సమ్మర్ విత్ పీ.బీ.ఎస్

**భరతుల ఫణిరాజ**

**ఎన్నడూలేనిది ఆరోజు నిద్రలేచే సరికి ఉదయం ఎనిమిది దాటింది. తీరిగ్గా పనులూ, ఫలహారాలూ ముగించుకుని కాలక్షేపం కోసం గుర్నాధం ఇంటికి బయలుదేరాను. గుర్నాధం, నేనూ గత మూడేళ్లుగా రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో సెక్షన్ ఆఫీసర్లుగా పనిచేసి ఈ మధ్యే రిటైరయ్యాము. కావలసినంత ఖాళీ సమయం దొరకటంతో ఇద్దరూ చేతనైనంత వరకూ సాంస్కృతిక, సామాజిక సేవలోనే కాలం వెళ్లబుచ్చుతున్నాం.**

గుర్నాధం ఇల్లంతా ఏదో సందడిగా వుంది. సాధారణంగా ముందు హాల్లోనే కన్పించే గుర్నాధమూ లేడు. లోనికెళ్లి చూస్తే ఐదారేళ్ల పాప ఒక్కతే ఆడుకుంటూ ఉంది. అర్థం కాలేదు. తలుపు దగ్గరే తటపటాయిస్తున్న నన్ను చిన్నారి అదోలా చూసింది.

'గుర్నాధం' గట్టిగా పిలిచా. లోపల ఉన్నాడేమోనని.

''గ్రాన్పా వెంటవుట్' అందాపాప తాపీగా.

అప్పుడర్థమైంది. బహుశా గుర్నాధం వాళ్లబ్బాయి ఢిల్లీనుంచి కుటుంబ సమేతంగా వచ్చినట్లున్నాడు. ఇంతకుముందు ఒకట్రెండు సార్లు అబ్బాయి వచ్చినప్పుడు కలవడం కుదర్లేదు. పాపను చూస్తే ముచ్చటేసింది.

"తాతయ్య ఎక్కడికెళ్లాడమ్మా?'' ఆప్యాయంగా దగ్గరికెళ్లాను.

అయోమయంగా చూసింది. కొత్తముఖం కదా అనుకున్నా.

మళ్లీ అడిగా ఫోజుగా ఇంగ్లీషులో ''వేర్ హి వెంట్?''

ఇప్పుడు నవ్వింది. ''హి వెంట్ టు ఎలిఫెంట్ ఐడల్ ఫంక్షన్'' ఠపీమని జవాబిచ్చింది. నాకే అర్థం కాలేదు. మళ్లీ అడగాలంటే సిగ్గేసింది. అంతలో హాల్లోకొచ్చింది వరలక్ష్మమ్మ. బహుశా నా గొంతు విన్నట్టుంది.

''రండన్నయ్యగారూ! దీంతోనా తెలుగు మాట్లాడుతున్నారూ'' అంది నా వైపు జాలిగా చూస్తూ.

''ఇది మా రఘు కూతురు స్వీటీ. తెలుగస్సలు రాదనుకోండి. పెందళాడే ఈయనేమో రాధానగర్‌లో గుడి కుంభాభిషేకానికి వెళ్లారు'' అంది కాఫీ అందిస్తూ.

అప్పుడర్థమయ్యింది. పాప ఇందాక చెప్పిన 'ఐడల్' సాక్షాత్తూ వినాయకుడన్నమాట.

''తెలుగు అర్థం కూడా అవదనుకుంటానమ్మా'' అడిగాను అనుమానంగా.

''ఎందుకడుగుతార్లెండి. తెలుగు కుటుంబమే

అయినా కోడలు పుట్టి పెరిగింది మొత్తం ఢిల్లీలోనే. తనకర్థమయ్యే తెలుగే అంతంతమాత్రం. ఇక కూతురికేం నేర్పుతుంది? వీళ్లకోసం వచ్చీరాని ఇంగ్లీషుతో నేనే అవస్థపడుతున్నా'' నిట్టూర్చింది పాపం.

నవ్వుకుంటూ అక్కడినుంచి గుడికి బయల్దేరాను.

కుంభాభిషేకం కన్నుల పండువగా జరిగింది.

నిండుగా అలంకరించిన వినాయకుని విగ్రహం చూస్తుంటే 'శుక్లాంబరధరం' గుర్తుకు రాలేదు. 'తొండమునేకదంతము' పద్యానికి అర్థం బోధపడడం లేదు. చెవిలో 'ఎలిఫెంట్ ఐడల్' రింగుమంటోంది. చేతులెత్తి దండం మాత్రం పెట్టగలిగాను.

తరచూ గుర్నాథం ఇంటికి వెళ్లి వస్తూండడంతో స్వీటీ బాగా అలవాటైంది. ఆ పాప దగ్గర చాలా విషయాలు తెలుసుకున్నాడేమో! అచ్చతెలుగు 'పప్పుచారు'ని చాల్ సూప్ అనాలట. మామిడి తాండ్ర కన్నా మేంగోపల్ప్ చాలా బాగుంటుందట. నమస్కారమనేమాట చాలా కష్టమని, గుడ్మార్నింగ్ ఎంతో సులభమని నాకప్పుడే తెలిసింది. '' ఒరులేయవి యొనరించిన'' పద్యంకన్నా ఓ..లుక్ ఎట్ ది మూన్ పద్యం అర్థవంతంగా ఉంటుందట. ఇంకా ఎన్ని విషయాలు తెలుసుకోవాలో ముమ్ముందు!

చివరికి గుర్నాథాన్నికూడా ఇంగ్లీషులోకి మారుస్తుందో (మార్చితే వాడి ఖర్మ) ఏమిటో! తలచుకుంటే నవ్వాగలేదు.

అన్నింటికన్నా నన్ను భయపెట్టిన విషయం మరోటుంది. 'అమ్మా' అని పిలవడం అస్సలు బావోదట. పని మనుషులు వాడే పదంలా ఉంటుందని, ఎంచక్కా 'మమ్మీ' అంటే ముద్దుగా వుంటుందని తల్లీకూతుళ్ల భావన. ఈజిప్టులోనో మరెక్కడోగానీ సమాధులను అదే పేరుతో పిలుస్తారు కదా! ఒకవేళ బయటికెళ్లిన కన్నతల్లి ఇంటికి తిరిగొస్తే 'మమ్మీ రిటన్స్' అనాలేమో! ఈ పద్ధతి ఇలాగే ప్రతి ఇంట్లోనూ కొనసాగితే.. ఇంకేమైనా వుందా? టెలిఫోన్ల రాకతో ఉత్తరాలు, సెల్ఫోన్ల విజృంభణతో పేజర్లు, కాలుక్యులేటర్లు, కంప్యూటర్ల రాకతో ఎక్కాల పుస్తకాలు కనుమరుగైనట్లే ఏదో ఒకరోజు తేట తెలుగు కూడా మాయమైపోతుందనడం అతిశయోక్తి కాదు. ఊహించుకుంటే ఊపిరి ఆగిపోయినట్లయింది. ఆలోచనల దొంతరల్లో జ్ఞాపకాలు బాల్యాన్ని కళ్లముందు నిలిపాయి. శతకాలు, నీతి సూక్తులు, లోకోక్తులు వర్ణమాల.. ఒకటేమిటి. ఇవన్నీ బడిలో చేరకముందే వల్లె వేసేవాళ్లం కదూ! పిల్లలంతా ఒకచోట చేరితే వీటితోనే సందడంతా. పొడుపు కథల ద్వారా పిల్లలకు కలిగే వినోదం ఎన్ని కార్టూన్షోలు చూస్తే వస్తుంది? చాటు పద్యాలు, చమత్కార సమస్యలతో మెదడుకు అందే మేత ఎన్ని సు'డొక్కు' లాడితే వస్తుంది? సరిగ్గా ఈ ఆలోచనల మధ్య మరో విషయం మనసులో మెదిలింది. ఇవన్నీ తాను బడిపంతులు బెత్తంతో బెదిరిస్తే నేర్చుకున్నవి కాదు. మరెలా తెలిసాయి? ఇంట్లోనే నేర్చుకున్నట్లు గుర్తు. అవును. అదే.. శిశు విజ్ఞాన భాండాగారం. ఇప్పుడు ఎక్కడుంది? అసలు ఇంట్లో ఉందా? అవసరం ఉన్నా లేకున్నా పుస్తకాలను పారేసే అలవాటు ఇంట్లో ఎవరికీ లేదన్న నమ్మకంతోనే సామాన్ల గది మొత్తం వెదికాను. నా నమ్మకం వమ్ము కాలేదు. విరిగిపోయిన చెక్క సామాన్ల కింద అమ్మ వాడిన ట్రంకు పెట్టె తెరచి చూస్తే, అమ్మ వాడిన వస్తువులు ఆప్యాయంగా నన్ను పలకరించాయి. పెట్టె అడుగున ఆత్రంగా తీసి చూశాను. దేవీ భాగవతం, శ్రీరామకోటి మరి కొన్ని పుస్తకాల మధ్యన సంవత్సరాల తరబడి నిర్లక్ష్యానికి గురై ముఖం 'చిన్న'బుచ్చుకున్న 'పెద్ద' బాలశిక్ష కనిపించింది. నిన్నటి సాంస్కృతి వైభవానికి శిథిల సాక్ష్యంగా ఉన్న ఓరుగల్లు కోటలాగ అవసాన దశలో ఉందా పుస్తకం. ఏదో తెలీని ఆప్యాయతతో ఆ పుస్తకాన్ని గుండెకి హత్తుకున్నాను. నా వయసు, విద్యార్హత అన్నీ మర్చిపోయి ఆత్రంగా ఆ పుస్తకాన్ని చదివాను. నాలుగొందల పేజీల నవలను ఒకే పూటలో ఏకబిగిన ముగించే నాకు ''నాన్న పులివచ్చె'' కథ తెలియని ఆనందాన్నిచ్చింది. అందులోని చిన్న చిన్న పదాల చిట్టా చదివాక అవన్నీ తెలుగుపదాలేనని 'కొత్తగా'గుర్తొచ్చింది. ఎందుకంటే ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో అవన్నీ దాదాపుగా 'ఔట్డేటెడ్' అయిపోయాయి. ఈమధ్య కొందరు తెలుగు భాషకు ప్రాచీన భాష హోదాకోసం సభలు, సమావేశాలూ జరపడం చూశాను. ప్రాచీన భాష హోదాకన్నా ముందుగా తెలుగుభాషకి మాతృభాష హోదా కల్పించడం తక్షణావసరం.

గుర్నాథం ఇంట్లో విషయం ఒక విధంగా క్షమార్హమే. ఎందుకంటే ఆంధ్రదేశంలోనే ఉన్న ఎందరో తెలుగువాళ్లు తమ పిల్లలను ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో వేయడం, తెలుగు ఉపయోగించవద్దని షరతులు పెట్టడం మనం చూడట్లేదా? వాళ్లని ఏమనాలి! కొన్నాళ్లిలాగే వదిలేస్తే మన రాష్ట్రంలో మన పిల్లలకు తెలుగు నేర్పడానికి ప్రవాసాంధ్రులను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడినా ఆశ్చర్యం లేదు.

నిన్నటికి నిన్న గోవిందరావు ఏమన్నాడు? ఇంగ్లీషు మీడియంలో చదివినందు వల్లే మనవాళ్లు ఐటీలో ముందున్నారట. నిజమే. కాదనను. ఇంగ్లీషును అసలు వాడకుండానే చైనా, జపాన్, ఫ్రాన్స్‌లు టెక్నాలజీలో అభివృద్ధి సాధించడం లేదా? వాటికన్నా మనం ముందున్నామా అభివృద్ధిలో..లేదే! ఇంకా నయం. తెలుగు రానందువల్లే ఉద్యోగాలొస్తున్నాయన్లేదు. ఇలా నా మనసు తన ప్రశ్నలకు తానే సమాధానాలిచ్చుకుంటుంటోంది.

చిన్న చూపుతో పెద్దబాల శిక్షకే 'పెద్దశిక్ష' విధించిన తెలుగు జాతి గొప్పతనానికి తల కొట్టేసినట్లయింది. మొత్తం పరిస్థితిని ఒక్కరోజులో మార్చలేకున్నా కనీసం నా వరకైనా న్యాయం చేయాలని నిర్ణయించుకున్నాను.

చాలారోజుల తర్వాత ప్రశాంతంగా నిద్రపట్టింది. కలలో ఏదో తెలీని వింతలోకం. చుట్టూ దూదిపింజల్లా తేలియాడే నీలిమేఘాలు, స్వర్గం నుండి వేలాడదీసినట్లున్న పూల ఉయ్యాల. అందులో ఎవరో స్త్రీమూర్తి 'విరాజిల్లు'తోంది. ధవళ వస్త్ర ధారిణి, చిరు మందహాసిని ఆనంద డోలికల్లో తేలియాడుతోంది.

దైవత్వం ఉట్టిపడుతున్న ఆ దేవతామూర్తి నన్ను దగ్గరికి రమ్మని పిలిచింది. వెళ్లి, అప్రయత్నంగానే నమస్కరించిన నేను 'ఎవరమ్మా నీవ'ని సంకోచిస్తూనే అడిగాను.

''నన్ను గుర్తించలేదా కుమారా!'' అంది ప్రశాంతంగా.

నెరిసిన జుత్తు, పంచె లాల్చీతో ఉన్న నన్ను 'కుమారా' అని పిలవడం ఆశ్చర్యం కలిగించింది.

''పరిచయం ఉన్నట్లే అన్పిస్తోంది కానీ, గుర్తు రావట్లేదమ్మా'' అన్నా బుర్ర గోక్కుంటూ.

''అదేవిటయ్యా! సచివాలయంలో అన్నేళ్లు పన్జేశావు కదా! నన్ను గుర్తించలేవా'' చిన్నబుచ్చుకుంది పాపం.

అప్పుడు గుర్తుకొచ్చింది. ఈమె ఎవరో కాదు. తెలుగుతల్లి. సచివాలయం ముందు నిలువెత్తు విగ్రహం కళ్లముందు కదలాడింది. ఛ.ఛ మన తెలుగుతల్లిని నేనే గుర్తుపట్టలేకపోయాను.

''క్షమించుతల్లీ. అయినా నేటి వాతావరణంలో తెలుగుకు పట్టిన తెగులు చూసి కాటుక చెదిరిన మోముతో పోత ముందు కన్నీటి పర్యంతమైన భాగవత కావ్య సరస్వతీలలామలా ఉంటావని ఊహించుకుంటే నువ్వేంటమ్మా ఇలా అమందానంద మందార మనోహర ముఖారవింద చంద్రికలా మందస్మితవై ప్రత్యక్షమయ్యావు? అందుకనే పోల్చుకోలేకపోయాను'' నాకు ఇంతగొప్పగా తెలుగులో మాట్లాడ్డం వచ్చని నాకే తెలీదు. పొంగిపోయాను. అసలు నన్ను నేనే నమ్మలేదు. నేనన్న వాక్యంలో ఎన్ని సమాసాలున్నాయో తర్వాత ఆలోచించాలి.

''నీలాంటి బిడ్డలు కోటికొక్కరు అచ్చతెలుగును స్వచ్ఛంగా మాట్లాడుతున్నంత కాలం నాకే లోటూ రాదు నాయనా! కాకపోతే ప్రమాదం అనేది ఎప్పుడైనా రావచ్చు. ఏమరపాటుగా ఉండొద్దని నీ సహోదరులకు వివరించే బాధ్యత నీదే'' అమ్మ అంతర్ధానమైంది. కలలోనే కర్తవ్యం బోధపడింది.

మరుసటి రోజే ప్రారంభమైంది ''సమ్మర్ క్యాంప్ ఆన్ పీబీయెస్-తెలుగు వాళ్ళకు మాత్రమే''. తెలుగు వాళ్లని ఆకర్షించడానికి ఇంగ్లీషు పేరు పెట్టక తప్పలేదు. వేసవి సెలవుల్లో తెలుగు నేర్చుకోవడానికి దాదాపు వందమంది చిన్నారులు ముందుకొచ్చారు. అందరికీ ఉచితంగా పెద్దబాల శిక్ష (పీబీఎస్) కోర్స్ మెటీరియల్ అందజేశాం. నెలరోజుల కోర్సు దిగ్విజయంగా పూర్తయింది. భాషలోని మహత్తు, అర్థవంతమైన చదువులోని ఆకర్షణ చిన్నారుల్లో ఆసక్తిని, అనురక్తిని రెట్టింపుచేశాయి. ఆంగ్ల శీర్షికతో ప్రారంభమైన పీబీయెస్ మొదటి బ్యాచ్ అచ్చతెలుగు శీర్షికతో ముగుస్తోంది. ఈరోజు సాయంత్రం ''సంపూర్ణ తెలుగు పెద్ద బాలశిక్ష శిక్షణా తరగతుల తొలివిడత ముగింపు ఉత్సవం'' మాతృభాషాభివృద్ధి రస్తు.

■